





సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/


శనివారం 28-6-2025

సంపుటి: 21 సంచిక: 82
పేజీలు: 8 వెల: రూ.1


## కందకం తవ్వుతారా?..

# ఖబడ్దార్!

- సానివాడ బరాటం చెరువు ఆక్రమణలో ట్విస్ట్
- ఆక్రమణలు తొలగించి కందకం తవ్వకానికి ఆదేశాలు
- పనులు చేపట్టేందుకు వెళ్లిన సిబ్బందిపై దాడికి యత్నం
- కార్యాలయానికి వెళ్లి ఎంపీడీవోనే నిలదీసిన అక్రమార్కులు
- పోలీసు రక్షణతో పనులు చేపట్టాలని అధికారుల నిర్ణయం





**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

కబ్జాదారుల గుప్పిట్లో చిక్కుకున్న సానివాడ చెరువు వివాదం మరోసారి వార్తల్లోకి వచ్చింది. ఈ చెరువును కొందరు అక్రమించి, ఆయకట్టు భూములకు నీరు అందకుండా చేస్తున్నారని గతం లోనే ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లగా.. సదరు చెరువు కబ్జాకు గురైన వైనంపై కొద్దిరోజుల క్రితమే 'సత్యం' ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం పాఠకులకు గుర్తుండే ఉంటుంది. ఈ ఫిర్యాదులకు స్పందించిన ఆక్రమణలు తొలగించి, చెరువుకు రక్షణగా చుట్టూ కందకం తవ్వించడానికి అధికారులు చేసిన ప్రయత్నాలను కూడా అక్రమార్కులు అడ్డుకుంటున్నారని తెలిసింది. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందినవారు ఏకమై చెరువును చెరబడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గార, శ్రీకాకుళం రెవెన్యూ మండలాల పరిధిలో విస్తరించి అంపోలు రెవెన్యూ సర్వే నెంబర్ 199 లో ఉన్న బరాటం చెరువు పూర్తి విస్తీర్ణం 19.53 ఎకరాలు కాగా ప్రస్తుతం 9.50ఎకరాలు మాత్రమే మిగిలాయి. దీనిపై సానివాడ సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్వే జరిపిన రెవెన్యూ అధికారులు సుమారు 9.76

- మిగతా చివరి పేజీలో





- ధర్మానకు, పార్టీకి మధ్య కుదిరిన సయోధ్య
- పాతపట్నం మినహా మిగతావాటికి సై
- నైర ఇసుక తవ్వకాలపై ప్రజాధర్నాకు మద్దతు
- 42 గ్రామాల ప్రజలతో కలిసి నడుస్తానన్న సంకేతం
- వచ్చే నెల 4 కోసం శ్రేణులు సమాయత్తం
- ధర్మానే వస్తున్నారంటూ గ్రామాల్లో కరపత్రాల పంపిణీ

## అలుక వీడి..

# అడుగు పడుతోందా?!



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు జనబాహుళ్యంలోకి రావడానికి దాదాపు ముహూర్తం ఖరారైంది. గడిచిన ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలైన తర్వాత వైకాపా నిర్దేశించిన కార్యక్రమాలకు సైతం ముఖం చూపించని ధర్మాన ప్రసాదరావు ఇప్పుడు స్వయంగా ఓ ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించడానికి ముందు కొస్తున్నారు. పార్టీ జెండా, అజెండాను పక్కన పెట్టి శ్రీకాకుళం రూరల్ మండలంలో సాగునీరు, తాగునీరు పరిరక్షించుకోడానికి 42 గ్రామాల ప్రజలు చేస్తున్న ఒక ఉద్యమాన్ని ఆయన ముందుండి నడపడానికి సిద్ధపడుతున్నారు.





ఎన్నికల ఫలితాలు వచ్చి ఏడాదైన తర్వాత తన ఓటమిని తేలిగ్గానే తీసుకున్నా గడిచిన ఐదేళ్లలో పార్టీ తీసుకున్న నిర్ణయాలపై పరోక్షంగా అసంతృప్తి జెండా ఎగరేసిన ధర్మాన ప్రసాదరావు ఒక విధంగా పార్టీపైన పట్టు సాధించగలిగారు. తన అలుక వెనుక పార్టీ ప్రయోజనాలే తప్ప తన వ్యక్తిగత అజెండా లేదన్న సంకేతాలు పంపడంతో జగమొండి జగన్ కూడా ధర్మాన అభిప్రాయాలను గౌరవించినట్లు తెలుస్తుంది. జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఎవరిని ఉంచుతారు? రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎవరికి టిక్కెట్లిస్తారు? అన్న కోణంలో కాకుండా ఏ సామాజికవర్గానికి ఎక్కడ ఎలా ప్రాధాన్యతనిస్తే గడిచిన ఎన్నికల్లో మళ్లీ విజయబావుటా ఎగరేస్తామో నిర్దేశించే కార్యాచరణను జిల్లా వరకు తనకు వదిలేయాలన్న ఆయన డిమాండ్‌ను జగన్మోహన్ రెడ్డి అంగీకరించినట్లు కనిపిస్తుంది. ఒక్క పాతపట్నం విషయంలో పార్టీకి, ధర్మానకు మధ్య పీఠముడి వీడక పోయినా, ఆ విషయంలో ధర్మాన పెద్దగా బెట్టు చేయడానికి సిద్ధంగా లేరని తెలుస్తుంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే పరామర్శలు, పలకరింపులు కాకుండా తన నియోజకవర్గంలో పెద్ద ఎత్తున జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై ఉద్యమించడానికి ఆయన సిద్ధపడుతున్నారు. అయితే ఇంకా

- మిగతా చివరి పేజీలో



• ఎడిటోరియల్

# ప్రపంచ పెద్దన్న స్వార్థం!

అమెరికా ఏం చేసినా.. దాని వెనుక స్వార్థ ప్రయోజనాలు కచ్చితంగా ఉంటాయి. ఇప్పుడే కాదు.. గతం నుంచీ అమెరికా ఆలోచనలు, నిర్ణయాలను గమనిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది. ఉమ్మడి రష్యా(యూఎస్ఎస్ఆర్) ఉన్నంతకాలం అమెరికాను ప్రతి విషయంలో అడ్డుకుంటూ వచ్చింది. ప్రపంచ ఆధిపత్యం కోసం ఆ రెండు దేశాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరిగేది. అదే సమయంలో ఆయుధ తయారీ మొదలుకొని అంతరిక్ష పరిశోధనల వరకు వాటి మధ్య ఆధిపత్య పోరాటం కొనసాగింది. 1991లో యునైటెడ్ సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్‌గా ఉన్న రష్యా చిన్న చిన్న దేశాలుగా విడిపోయింది. అప్పటినుంచీ అమెరికాకు ఎదురులేకుండాపోయింది. ఏకైక అగ్రరాజ్యంగా చెలామణీ అవుతూ ప్రపంచవ్యాప్తంగా సైనిక స్థావరాలు ఏర్పాటు చేస్తూ చాలా దేశాలపై ప్రత్యక్షంగా పరోక్షంగా పెత్తనం సాగిస్తోంది. అదే క్రమంలో అంతర్జాతీయ వాణిజ్యంలోనూ తన హవా కొనసాగించేలా నిర్ణయాలు తీసుకుంటోంది. తన నిర్ణయాలకు తలొగ్గని దేశాలపై ఏదో రూపంలో కయ్యానికి కాలు దువ్వి తనకు దాసోహం అనేలా చేస్తోంది. గత చరిత్రను పరిశీలిస్తే సుమారు 30 దేశాలపై అమెరికా యుద్ధానికి దిగి వాటిని కోలుకోలేని దెబ్బ తీసింది. మరోవైపు తన మిత్రదేశాల ద్వారా ప్రత్యర్థి దేశాలపై సైనిక ఘర్షణ లేదా యుద్ధాలకు పురిగొల్పడం.. ఆనక రంగంలోకి దిగి మధ్యవర్తిత్వం పేరుతో శాంతి వచనాలు పలుకుతూ ఇరుదేశాలను రాజీ పడేలా చేయడం అమెరికా దశాబ్దాలుగా అమలు చేస్తున్న వ్యూహం. పనిలో పనిగా ఆయా దేశాలు తనతో వాణిజ్య, సైనిక సంబంధాలు పెంపొందించుకునేలా బలవంతంగా ఒప్పించడం అమెరికాకు రివాజుగా మారింది. చివరికి తానే రెండు దేశాల మధ్య రాజీ కుదిర్చి రెండు దేశాల మధ్య యుద్ధాన్ని ఆపించానని ఇంటా బయటా డప్పు కొట్టుకోవడంలో అమెరికన్ పాలకులుగా దిట్టలని గతం నుంచీ అనుభవైకవేద్యమే. ఆ దేశ తాజా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇదే రీతి.. నీతి అనుసరిస్తున్నారు. ఏప్రిల్‌లో భారత్-పాక్ సైనిక ఘర్షణల సమయంలోనూ, నిన్న గాక మొన్న ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధ సమయంలోనూ అమెరికా స్వార్థబుద్ధి మరోసారి బయటపడింది. పహల్గాం ఉగ్ర ఊచకోత నేపథ్యంలో పీవోకేలోని ఉగ్రవాద శిబిరాలను భారత్ నాశనం చేయడం, దాన్ని తట్టుకోలేని పాకిస్తాన్ భారత్‌లోని పౌర అవాసాలపై వైమానిక దాడులకు తెగబడటంతో భారత్ ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్‌పై ఎదురు దాడి చేసింది. ఆ దేశంలో కీలకమైన వైమానిక స్థావరాలను ధ్వంసం చేసింది. ఈ సైనిక చర్య కొనసాగుతున్న తరుణంలోనే ట్రంప్ ఉన్న ఫళంగా తన సొంత సోషల్ మీడియా ట్రత్ సాక్షిగా ఇరు దేశాల మధ్య కాల్పులు విరమణ ఒప్పందం కుదిరిందని, అందుకు తానే భారత్, పాక్‌లను ఒప్పించానని ఏకపక్షంగా ప్రకటించేశారు. కానీ భారత్ ముందు అమెరికా పప్పులు ఉడకలేదు. అయితే చిరకాల మిత్రదేశమైన పాకిస్తాన్ మాత్రం ట్రంప్‌కు వంగి వంగి సలాములు చేసింది. ఘనంగా కృతజ్ఞతలు చెప్పింది. దాంతో మురిసిపోయిన ట్రంప్ ఎన్నడూ లేనివిధంగా పాక్ సైన్యాధ్యక్షుడినే తనతో డిన్నర్ భేటీకి ఆహ్వానించారు. ఆ సందర్భంగా పాక్‌కు పలు ఆధునిక ఆయుధాలు, విమానాలు ఇస్తామని హామీ ఇచ్చి వేల కోట్ల రూపాయల కొత్త ఒప్పందాలకు తెర తీశారు. ఇది అమెరికా రక్షణ మార్కెట్‌కు బూస్ట్ ఇస్తుందనడం సందేహం లేదు. ఇక ఈ నెలలోనే జరిగిన ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంలోనూ ట్రంప్ ఇదే తరహా రాజీ రాజకీయం నెరిపారు. తొలుత తన అనంగు మిత్రదేశమైన ఇజ్రాయెల్‌ను శత్రుపక్షమైన ఇరాన్‌పైకి ఉసిగొల్పి దాడులు చేయించారు. దాంతో ఇరాన్ కూడా ప్రతి దాడులకు దిగి ధీటైన సమాధానం ఇచ్చింది. స్వయంగా అమెరికా కూడా ఇరాన్‌లోని అణు కేంద్రాలపై బంకర్ బస్టర్ బాంబులు ప్రయోగించి, వాటిని నాశనం చేసింది. 12 రోజులపాటు భీకరంగా యుద్ధం జరిగి.. ఇరుదేశాలు భారీగా నష్టపోయిన తర్వాత ట్రంప్‌గారు తీరిగ్గా శాంతి వచనాలు వల్లిస్తూ.. షరా మామూలుగానే కాల్పుల విరమణకు ఇరుదేశాలు అంగీకరించాయని హఠాత్తుగా ప్రకటించారు. అదే ఊపులో ఇరాన్‌పై ఉన్న వాణిజ్య ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో చైనా అగ్రస్థానంలో ఉంది. యుద్ధం నేపథ్యంలో ట్రంప్ ఇరాన్‌తో వాణిజ్యంపై ఆంక్షలు విధించారు. యుద్ధం ముగిసినందున ఇరాన్‌పై ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు ప్రకటించడంతో పాటు అమెరికా నుంచి కూడా చైనా ముడిచమురు కొంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. దాంతో ఇదంతా ట్రంప్‌గారి వ్యాపార స్ట్రాటజీ అని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

# అంటువ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సీజనల్ అంటువ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శ్రీకాకుళం రూరల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ టి.చిరంజీవి నాయుడు, డాక్టర్ బి.నమ్రత ప్రియ ఆదేశాలు మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి గొర్లె రవికుమార్ పర్యవేక్షణలో ఆరోగ్య కేంద్రం పరిధిలోని 13 సచివాలయాలలోని గ్రామాలలో జ్వరం, అతిసార వంటి వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి, నమోదు చేసుకుని తక్షణం ప్రాథమిక చికిత్స అందించడం కోసం హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు ప్రతిరోజూ ఇంటింటి సర్వేలు నిర్వహిస్తున్నామని హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు తెలిపారు. ఆ సమయంలో అతిసార, కామెర్లు, టైఫాయిడ్, డిసెంట్రీ వంటి వ్యాధులకు దూరంగా వుండటం కోసం ప్రజలందరూ కాచి చల్లార్చి వడకట్టిన నీటినే త్రాగాలని, పండ్లు, కూరగాయలు వంటివి చక్కగా నీటితో కడగాలని, ఇంట్లో వండిన ఆహారపదార్థాలపై మూతలు వుంచాలని, అపరిశుభ్ర వాతావరణంలో వున్న బయటి ఆహార పదార్థాలు సేవించరాదని, బహిరంగ మలవిసర్జన చేయకూడదని వివరించినట్లు తెలిపారు. అలాగే మలేరియా, గున్యా, ఫైలేరియా, డెంగీ, జపనీస్ ఎన్.సెఫలైటిస్ వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులకు దూరంగా వుండటం కోసం మంచినీటి పాత్రలపై మూతలు పెట్టాలని, ఇంటి పరిసరాలలో నీటినిల్వలు లేకుండా వుండేందుకు ప్లాస్టిక్ వ్యర్థాలు, టైర్లు, త్రాగేసిన కొబ్బరి బొండాలు వంటి వాటిని తొలగించడంతోపాటు ఇంటి ద్వారాలకు, కిటికీలకు దోమ తెరలు వాడాలని, ఇంట్లో దోమల మందు చక్రాలు, వేపపొడి పొగ వేయడం ద్వారా నివారించవచ్చున్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ వ్యాధులపట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఏ చిన్న అనారోగ్యం చేసిన వెంటనే ఆరోగ్య కేంద్రంకు వెళ్లి చికిత్స పొందడం ద్వారా ప్రాణాపాయం నుంచి రక్షణ పొందవచ్చని ఆరోగ్య సిబ్బంది ప్రజలకు పెద్దఎత్తున అవగాహన కల్పిస్తున్నారని హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు శ్రీదేవి, రాములమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# సీపీఎం నాయకులు బాలరాజు మృతికి సంతాపం



(సత్యంన్యూస్, నందిగాం)

సీపీఎం సీనియర్ నాయకులు కవిటి బాలరాజు మృతికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శి వర్గ సభ్యులు సభ్యులు బి కృష్ణమూర్తి, కె.మోహనరావులు సంతాపం తెలిపారు. ఈమేరకు శనివారం మండలంలోని పీవీపురంలో బాలరాజు మృతదేహానికి వారు పార్టీ జెండాను కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో వారు మాట్లాడుతూ బాలరాజు డివైఎఫ్ఐ మొదటి సదస్సు జిల్లాలో వాళ్ళ గ్రామంలో నిర్వహించారన్నారు. ఆరోజు ఏర్పడిన కన్వినింగ్ కమిటీలో కమిటీ సభ్యులుగా ఉన్నారని, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా సుదీర్ఘకాలం రైతాంగ సమస్యలపై పనిచేశారని కొనియాడారు. గిట్టుబాటు ధర పైన, చివరి భూములకు నీరు ఇవ్వాలన్నారు. భవనిర్మాణ కార్మిక సమస్యలపై, ఉప్పు కార్మికుల సమస్యలపైన ఉద్యమాల్లో ఉన్నారన్నారు. ఆయన మృతి ఉద్యమానికి తీరని లోటన్నారు. బాలరాజు ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. బాలరాజు అంతిమయాత్రలో పార్టీ నాయకులు నంబూరు షణ్ముఖరావు, పాలిని సాంబమూర్తి, హనుమంతు ఈశ్వరరావు, బగాది వాసుదేవరావు, తెప్పల అజయ్‌కుమార్, ఎన్.గణపతి, నెయ్యిల మోహనరావు, ఎన్.భైరాగి, ఎన్.సింహాచలం, బి.రామకృష్ణ, గ్రామ ప్రజలు, ఆయన అభిమానులు పాల్గొన్నారు.

# సంతోషిమాత జయంతి ఉత్సవాలకు తరలిరండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


పాత శ్రీకాకుళం శ్రీ సంతోషిమాత దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సంతోషిమాత జయంతి ఉత్సవాలకు తరలి రావాలని ఆలయ ప్రధాన అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ కోరారు. ఈమేరకు దేవాదాయ శాఖ కమిషనర్ బీవీఆర్ ప్రసాద్ పట్నాయక్‌ను శనివారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో కార్య నిర్వహణ అధికారిణి మునగవలస సుకన్య, దేవస్థానము సీనియర్ గుమస్తా నాగేశ్వరరావు తదితరులున్నారు.



# సీనియర్ జర్నలిస్టుకు ఐతమ్ సన్మానం

(సత్యంన్యూస్, టెక్కలి)

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజనీరింగ్ కాలేజీలో ప్రెస్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన సీనియర్ పాత్రికేయుడు సంపతిరావు విశ్వనాధంకు కళాశాల యాజమాన్యం శనివారం ఘనంగా సత్కరించింది. ఈసందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, సెక్రటరీ ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టి.నాగరాజులు మాట్లాడుతూ అంకిత భావంతో విధులు నిర్వహించిన విశ్వనాధంను ప్రశంసించారు. కళాశాల అభివృద్ధినీ, విద్యార్థుల విజయాలను సమాజానికి చేరవేస్తూ ఒక వారధిగా తనవంతు పాత్రను పోషించారన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో యాజమాన్యంతో పాటు ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.యస్. శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్ టి.నాగాశేషు, ఎస్టేట్ మేనేజర్ పిరియా రమేష్ కుమార్, చీఫ్ అకౌంట్ ఆఫీసర్ నరసింహరాజు, అడ్మిషన్ విభాగం అధికారి బి.వి.జి.మురళీ కృష్ణ, హెచ్ఆర్ శ్రీధర్, వెల్ఫేర్ ఆఫీసర్ సుధీర్, హెడ్ క్యాషియర్ చంద్రశేఖర్, గ్రంధాలయ అధికారి డాక్టర్ ఎం.వి.సుబ్బారావు, పిరియా సురేష్‌కుమార్, పరిపాలన విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# ప్రేక్షకులు మూడవకన్ను తెరవకుండా ప్రభాస్ కాపాడాడు!

**భారీ అంచనాలతో కన్నప్ప విడుదలైంది. మంచు విష్ణు కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో తీసిన సినిమా. దానికి తోడు ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయకుమార్ కూడా ఉండటంతో అంచనాలు పెరిగాయి. ఇంతకీ సినిమా ఎలా ఉంది? మంచు విష్ణు హిట్ కొట్టాడా?**

కన్నప్ప కథ తెలుగు వాళ్లకి తెలిసిందే. ఇతర భాషల వాళ్లకు కొత్తగా అనిపించవచ్చు. కాళహస్తీ శ్వర మహత్యం తరువాత 24 ఏళ్లకు కృష్ణంరాజు (1976) భక్త కన్నప్ప తీశారు. గిరిజనుడైన (చెంచు) కన్నప్ప నాస్తికుడు. బలికోరే అమ్మవారు దేవత ఎలా అవుతుందనే వ్యక్తి. రాయి దేవుడు కాదని వాదించే తత్వం. ఈ కన్నప్ప శివభక్తుడిగా ఎలా మారాడు, కళ్లనే శివయ్య కోసం త్యాగం చేసే మహాభక్తి ఎలా ఆవహించింది? సింపుల్ ఇదే కథ. దీనికి సున్నితమైన ప్రేమ కథ, ద్వంద్వ యుద్ధం, దొంగ పీఠాధిపతి మోసం కలిపి బాపు 'భక్త కన్నప్ప' తీశారు.ఇదే కథని ఇంకొంచెం పెంచి ఐదు తెగలుగా మార్చి కన్నప్ప తీశారు.

**కథేంటి?:** కన్నప్ప పాత్రలో విష్ణు నటించారు. వాయులింగాన్ని కాపాడుకుంటూ వస్తున్న తెగని మహదేవశాస్త్రి (మోహన్‌బాబు) శాసిస్తుంటారు. ఈ లింగాన్ని తస్కరించడానికి శక్తిమంతమైన సైన్యంతో కాలముఖుడు అనే విలన్ ప్రయత్నిస్తే అక్కడి ఐదు తెగలు ఏకమై ఎదుర్కొంటాయి. ఇందులో తిన్నడిని (విష్ణు) నాయకుడిగా ఎన్నుకుంటారు. అయితే అతను మారెమ్మ (అమ్మవారు)కు వ్యతిరేకి కావడంతో తండ్రే తిన్నడిని బహిష్కరిస్తాడు. హీరోయిన్ నెమలి (ప్రీతి ముకుందన్) కూడా తిన్నడితో పాటు వెళ్లిపోతుంది. ఇక్కడి వరకూ ప్రేమ, యుద్ధమైతే, మిగతా కథంతా శివయ్య లీలలు, భక్తి భావం. చివరి 40 నిమిషాలు కీలకం, అందరూ ఎదురు చూసే ప్రభాస్ వస్తాడు కాబట్టి.

**టెక్నికల్‌గా ఎలా ఉంది?:** ఫస్టాఫ్ కొంచెం నిదానంగా వుంటుంది. తెగల యుద్ధం, ప్రేమ కథలో బలమైన సన్నివేశాలు లేవు. కాకపోతే గ్రాఫిక్స్, న్యూజిలాండ్‌లో తీయడం వల్ల సినిమాలో ఫ్రెష్‌నెస్ కనిపిస్తూ వుంటుంది. నిడివి 3 గంటలకి పైగా ఉండటం ఇబ్బంది. ఫైట్ సీన్స్‌లో ఫొటోగ్రఫీ, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ బాగున్నాయి. శివయ్య భక్తికి సంబంధించిన డైలాగ్‌లు చమక్కుమనిపించాయి.బ్రహ్మానందం, సప్తగిరి ఉన్నా కామెడీ ఏమీలేదు. బహుశా పిలక వివాదంతో కట్ చేసినట్టున్నారు. తెగ నాయకుడిగా శరత్‌కుమార్ బాగా నటించాడు. కానీ, డైలాగులు తమిళ యాసలోనే చెబుతాడు.

## విష్ణు ఎలా నటించాడు?

శివుడిగా అక్షయకుమార్, పార్వతీగా కాజల్ మెప్పించారు. తెరపై మోహన్‌లాల్ కాసేపు, మోహన్‌బాబు కొంచెం ఎక్కువ సేపు కనిపిస్తారు. కన్నప్పలో అందరూ అనుకున్నది విష్ణు ఈ పాత్రని మోయలేడని, ఎమోషన్ పలికించలేడని, సినిమాకి సాయంగా వచ్చిన ప్రభాస్ కూడా రక్షించలేడని. అయితే ఎమోషన్స్ సీన్స్‌లో విష్ణు బాగా నటించాడు, కన్నీళ్లు పెట్టించాడు. ప్రభాస్ గెస్ట్‌లా కాకుండా సినిమాకి ఆయువు పట్టులా నిలిచాడు. ప్రభాస్ ఎంట్రీ తర్వాతే ప్రేక్షకుల మూడ్ మారిపోతుంది. క్లైమాక్స్ , ప్రీ క్లైమాక్స్ సినిమాని నిలబెట్టాయి. సొసైటీలో భక్తి పెరిగినప్పటికీ, భక్తి సినిమాలు తీసి ప్రేక్షకులను థియేటర్లకి రప్పించడం కష్టం. ప్రొడక్షన్ వాల్యూస్ విపరీతంగా పెంచుకోవడమే దీనికి మార్గం. కారణం ఏమంటే రాజమౌళి బాహుబలి తీసిన తర్వాత వ్యయం, తెలుగు స్టామినా పెరిగిపోయాయి. ఆ రేంజ్‌లో వుంటే తప్ప సంతృప్తి పడటంలేదు. కన్నప్పలో గ్రాఫిక్స్ అక్కడక్కడ తేలిపోయినా, ఖర్చు తెరమీద కనిపించింది. విష్ణు ఓ మంచి సినిమాను అందివ్వాలనే ప్రయత్నం అయితే చేశాడు. కానీ, ఈ జనరేషన్ ప్రేక్షకులకి ఏ మేరకు నచ్చుతుందో చూడాలి.

# సన్నని నడుములో శ్రియా లెహంగా హొయలు

సినిమా రంగంలో తన నటనతో ఎంతగానో మెప్పించిన శ్రియా శరణ్... ఇప్పుడు ఫ్యాషన్ రంగంలోనూ అదరగొడుతోంది. ఇటీవల ప్రముఖ డిజైనర్ లేబుల్ కోసం ఆమె చేసిన ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. మాలిబులో గార్డెన్ ఆఫ్ ఈడెన్ కలెక్షన్‌కి చెందిన ప్యాస్టెల్ బ్లూ కలర్ లెహంగా లుక్‌లో ఆమె ఎటువంటి సందేహాలకూ తావు లేకుండా గ్లామర్‌కు కొత్త నిర్వచనం ఇచ్చింది. మృదువైన రంగులు, ఆకర్షించే డిజైన్, శ్రియా నడుమున మెరిసే ఆ హావభావాలు.. అన్నీ కలగలిపి ఈ లుక్‌ను అద్భుతంగా మార్చేశాయి. ఈ లుక్‌లో కనిపించిన శ్రియా లెహంగా లైట్ బ్లూ షేడ్స్‌తో నాజూకుగా ఉంది. మెరుస్తున్న బ్లౌజు డిజైన్, మ్యాచ్ అయిన స్కర్ట్‌పై ఉన్న నాజూకు పువ్వుల ఎంబ్రాయిడరీ... ఆమెను ఒక ఫెయిరీటేల్ ప్రిన్సెస్‌లా చూపించింది. ఈ ఫోటోల్లో ఆమె వేసుకున్న జుమ్కాలు, మృదువైన హెయిర్‌స్టైల్ మరింత అందాన్ని జోడించాయి. సోషల్ మీడియాలో ఈ లుక్‌కి అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. శ్రియా శరణ్ కెరీర్ విషయానికి వస్తే, ఆమె దక్షిణాది సినీ ఇండస్ట్రీలోనే కాదు, బాలీవుడ్‌లోను తన ప్రత్యేకతను చాటుకుంది. 'శివాజీ'లో రజనీకాంత్‌కు జోడిగా, 'గౌతమిపుత్ర శాతకర్ణి'లో బాలకృష్ణ సరసన, అలాగే హిందీలో 'దృశ్యం' సిరీస్‌లో అజయ్ దేవగన్‌కి భార్యగా ఆకట్టుకున్నారు. ఇటీవలి కాలంలోనూ ఆమె 'ఆర్‌ఆర్‌ఆర్' వంటి పాన్‌ఇండియా ప్రాజెక్టుల్లోనూ కనిపిస్తూ, స్టార్డమ్‌ను కొనసాగిస్తూ వస్తోంది. తన కెరీర్‌కి తిరుగులేని గుర్తింపు తెచ్చుకున్నా కూడా, శ్రియా సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉండి.. ప్రతి లుక్‌తోనూ ట్రెండ్ సెట్ చేస్తోంది. ఆమె గ్లామర్‌ను చూస్తే వయస్సు కేవలం ఒక నెంబర్ అనిపిస్తుంది. మరోవైపు యాడ్స్, ఫ్యాషన్ ఫోటోషూట్‌లతోనూ బిజీగా ఉంది.




- తుపాకి.కామ్ సౌజన్యంతో...

## సీనియర్ సిటిజన్స్‌కు ముందుగానే రేషన్ సరఫరా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వంలో సీనియర్ సిటిజన్స్‌కు ముందుగానే రేషన్ సరఫరా నిర్వహించడం ఆనందదాయకమని 15వ డివిజన్ ఇన్‌చార్జ్ ఇప్పిలి తిరుమలరావు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు డివిజన్ పరిధిలో శనివారం చేపట్టిన రేషన్ పంపిణీని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాలతో నాలుగు రోజులు ముందుగానే సీనియర్ సిటిజన్స్‌కు రేషన్‌ను పంపిణీ చేసేలా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో రేషన్ డిపో మేనేజర్ మహేష్ తదితరులున్నారు.





ఆరోగ్య ప్రధాత శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని శనివారం జిల్లాకు చెందిన ఎస్వీ సతీష్, పావని దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సతీష్ తన తండ్రి ఎస్వీ సూర్యప్రకాష్ ఆలయ అభివృద్ధికి రూ.1,11,111లు చెక్కును ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి కేవీఎస్‌వీడీవీ ప్రసాద్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం



జగన్నాధ స్వామి రథయాత్రలో భాగంగా ఎచ్చెర్ల నియోజకవర్గం లావేరు మండలం మురపాక గ్రామంలో జగన్నాధ ఆలయంలో స్వామి వారిని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం దర్శించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పిటీసి మీసాల సీతం నాయుడు,సర్పంచ్ ప్రతినిధి పెయ్యల లక్ష్మణ రావు,లావేరు మండల వైసిపి యువజన విభాగం అధ్యక్షులు బాలి శ్రీనివాస నాయుడు, వార్డ్ సభ్యులు ఎన్నేటి ఈశ్వర రావు, కొన్ని పరసయ్య, మీసాల అప్పారావు, వడ్డి సుర్యకుమార్, వండాన సిమ్మినాయుడు, గొర్లె శ్రీనుబాబు, ఇప్పిలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


–సత్యంన్యూస్, ఎచ్చెర్ల

## జూలై 3న వైకాపా ప్రత్యేక సమావేశం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



చంద్రబాబు హామీల పతనాన్ని ప్రజలందరికీ వెల్లడించే లక్ష్యంతో వైకాపా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించనున్న 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమంపై ఆలోచనలు, కార్యాచరణ ఖరారు చేసేందుకు వచ్చే నెల 3వ తేదీన శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి ఉత్తరాంధ్ర పార్టీ సమన్వయకర్త కురసాల కన్నబాబు, జిల్లా పరిశీలకులు కుంభ రవిబాబు ముఖ్య అతిథులుగా హాజరవుతారు. జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమంలో అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలు, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు, నాయకులు హాజరుకావాలని కోరారు.



వైకాపా నగర ప్రధాన కార్య దర్శి సీపాన మహేంద్ర మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావును శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## పాఠశాలకు ఫ్యాన్ల వితరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాల పూర్వ విద్యార్థి కొరి కాన చిన్ననాయుడు మనబడి మన ఊరు కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు అవసరమైన రెండు ఫ్యాన్లను ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివిన వారు పాఠశాలకు తగిన సహాయ సహకారాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అదపాక దామోదర్‌రావు, పురుషోత్తం, కృష్ణ, ప్రసాద్, శ్రీరామ్ పాల్గొన్నారు



## విద్యార్థులు విద్యా విలువలను అలవర్చుకోవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నో బ్యాగ్‌డే సందర్భంగా రాజాంకు చెందిన యోగ శిక్షకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉండవలసిన విలువలైన నిజాయితీ, పనిలో నిమగ్నం అవ్వడం, తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను మిత్రులతో చర్చించుకోవడం, నేర్చుకోవడం కోసం సిద్ధంగా ఉండడం వంటి అంశాలను కథల రూపంలోనూ కృత్యాల రూపంలోనూ, పాటల రూపంలో విద్యార్థులతో పంచుకోవాలన్నారు. విద్యార్థులు వీటిని పాటించి మంచి ఫలితాలు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లేశ్వరరావు ఉపాధ్యాయులు దామోదర్ రావు, శ్రీనివాసరావు, ప్రసాద్, శ్రీరామ్ పురుషోత్తమ్, కృష్ణ పాల్గొన్నారు.





## నరసన్నపేటలో ప్రజాదర్బార్

(సత్యంన్యూస్, నరసన్నపేట)

ప్రజాసమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు వచ్చి వినతులను ఎమ్మెల్యేకు అందజేశారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

## కీర్తిచక్ర' పురస్కార గ్రహీతకు మంత్రి అభినందన

(సత్యంన్యూస్, టెక్కలి)

విధి నిర్వహణలో అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించిన శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం నగిరి పెంటకు చెందిన మేజర్ మల్లా రాంగోపాల్ నాయుడును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు.కుటుంబసభ్యులతో ఆయన క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాంగోపాల్ చూపిన ధైర్య సాహసాలను అభినందించారు. కీర్తిచక్ర' పురస్కారం తీసుకోవడం జిల్లాకు గర్వకారణమన్నారు.



## నిత్యవసర సరుకులు పంపిణీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



టెక్కలి నియోజకవర్గం టెక్కలి ఆది ఆంధ్ర వీధికి చెందిన బీజేపీ మండల ఉపాధ్యక్షులు పెనిమింటి ఉమాబాబు కుటుంబానికి చెందిన పెనిమింటి జగదీష్ మృతి చెందడంతో టెక్కలి బీజేపీ నాయకులు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ అతని భార్య పినిమింటి ధనలక్ష్మికి నిత్యావసర సరుకులు, తమవంతు సహకారం అందించారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు జర్జన రాంజీ, బీజేపీ మోర్చా జిల్లా అధ్యక్షులు జన్ని పరమేశ్వరరావు, మాజీ మండల అధ్యక్షులు గునామీన కుమార్, నియోజకవర్గ కో-కన్వీనర్ నడిపూరి లక్ష్మీనారాయణ, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు ధవళ వెంకటేష్, మండల ఉపాధ్యక్షులు, పిట్ట రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

## విత్తనాలు, ఎరువులతో సంసిద్ధంగా ఉండండి

(సత్యంన్యూస్, టెక్కలి)

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో సహకారం అందించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధానంగా రైతులు ఖరీఫ్ సాగుకోసం అవసరమైన విత్తనాలు సకాలంలో అందించడానికి అన్నిరకాల ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ప్రధానంగా రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు బారులు తీరకుండా నిరంతరాయంగా వారికి అవసరమైన విత్తనాలు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సకాలంలో వర్షాలు కురవడంతో పాటు, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే ఎరువులు, విత్తనాలు అందించడానికి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పనులు ముమ్మరంగా సాగుతున్న సమయంలో దూరప్రాంతాలు వెళ్లి ఎరువుల తీసుకోవడం రైతులకు కష్టంగా ఉంటుందని, అందువల్ల రైతులకు అనువైన ప్రదేశాల్లో రైతు సేవాకేంద్రాలు, పీఏసీఎస్‌ల ద్వారా ఎరువులు అందించాలని సూచించారు. సాగుకు అవసరమైన అన్ని రకాల తోడ్పాటును అందిస్తామన్నారు. రైతుకు పెట్టుబడిసాయం కింద అర్హత ఉన్న వారికి అన్నదాత సుఖీభవ అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో కింజరాపు హరివరప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారులు జగన్మోహన్ రావు, గోవిందరావు, అప్పారావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## హైస్కూల్ ప్లస్‌ల్లో ఖాళీలు నింపాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రస్తుతం హైస్కూల్ ప్లస్‌లలో ఖాళీ అయిన అధ్యాపకులను భర్తీ చేయాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనెల రమేష్ కోరారు. ఈమేరకు విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌ను శనివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇంటర్‌లో కళాశాలల్లో అధిక శాతం మంది విద్యార్థులు చేరుతున్నారన్నారు. తరగతులు కూడా ప్రారంభమయ్యాయని, కానీ సరిపడా సిబ్బంది లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ముఖ్యంగా ఎక్కువ మంది డెప్లాయడ్ పీజీటీలు 8 ఏళ్ల నిబంధనలు విధించడం వలన, మరికొంతమంది పదవీ విరమణ పొందడంతో అనేక ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. 150 హైస్కూల్ ప్లస్‌లలో 500 మంది డెప్లాయడ్ పీజీటీ పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. విద్యార్థులకు తరగతులు అర్థం కాక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇంటర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆభద్రతా భావనకు లోనై ప్రభుత్వ హైస్కూల్ ప్లస్ ఇంటర్ విద్యపై విశ్వాసం కోల్పోతున్నారు. తక్షణమే ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేసేలా చూడాలని కోరారు.



## జూలై 2 వంశధార సాగునీరు విడుదల

(సత్యంన్యూస్, టెక్కలి)

జిల్లాలో ఖరీఫ్ రైతాంగానికి అవసరమైన పూర్తస్థాయిలో సాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నీటి పారుదలశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఖరీఫ్‌కు సంబంధించి రైతులకు సాగునీరు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నీటిపారుదల శాఖ అధికారుతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక సాగు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవసరమైన సూచనలు సలహాలు అందించాలన్నారు. రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో వంశధార కుడి, ఎడమకాలువ ఆయకట్టు నుంచి సాగునీరు రైతులకు వచ్చేనెల 2న నీరు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ముందుగా రిజర్వాయర్లల్లో నీటి నిల్వలు పెంచి శివారు ప్రాంతాలకు సైతం నీరు చేరేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందుగా చెరువులను నీటితో నింపాలని సూచించారు. వ్యవసాయ పనులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చోట అత్యవసర మరమ్మత్తులు చేయాలని ఆదేశించారు. కాలువల ద్వారా నీటి సరఫరా ఇబ్బందులు ఉన్న ప్రదేశాల్లో ఉంటే వాటిని తక్షణమే తొలగించి సజావుగా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గొట్టా బ్యారేజీలో ఇప్పటి వరకు 1400క్యూసెక్కులు నీరు నిల్వ చేసినట్లు మంత్రికి నీటిపారుదలశాఖ అధికారులు వివరించారు. అవసరమున్న ప్రాంతాల్లో తాత్కాలిక సిబ్బందిని నియమించుకుని వారు కాలువల్లో ప్రవహిస్తున్న నీరు వృధా కాకుండా పర్యవేక్షించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు స్వర్ణకుమార్, శేఖర్‌రావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



### రంగస్థల కళాకారులకు
## ప్రభుత్వం అండగా ఉంటుంది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రంగస్థల కళాకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ఎస్పీ బంగ్లా దరిలో గల శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నూతన భవనం ప్రారంభోత్సవంలో శనివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నటరాజ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ శ్రీకాకుళంలో కళాకారులకు కొదవలేదని, జిల్లా నుండి సినీ రంగంలోకి అనేకమంది కళాకారులు జిల్లా నుండి వెళ్లి సుస్థిరస్థానం సంపాదించారన్నారు. కళాకారుల సమాఖ్య ద్వారా నగరంలో జరిగిన అనేక కార్యక్రమాలలో తాను ఇదివరకు పాల్గొన్నానన్నారు. శ్రీకాకుళం రంగ స్థల కళాకారుల సమాఖ్యకు అన్నివిధాలా తన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. టీడీపీ ఉపాధ్యక్షులు పీఎంజే బాబు ప్రతిపాదించిన ఇండోర్ స్టేడియం ఉండాలనే అంశాన్ని పరిశీలించామని, అందుకు ఇదివరకే ప్రణాళిక సిద్ధం చేశామని, త్వరలో కార్యాచరణ జరిగే విధంగా చూస్తానన్నారు. అనంతరం కళాకారుల సమాఖ్య సభ్యులందరూ ఎమ్మెల్యే శంకర్‌ను దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది, రంగస్థల కళాకారుల సమాఖ్య సభ్యులు ఎల్.రామలింగస్వామి, పన్నాల నరసింహమూర్తి, రామచంద్రదేవ్, పిఎంజె బాబు, చిట్టి నాగభూషణం, రమణారావు, కవ్వాడీ సుశీల, జయమ్మ తదితరులు పాల్గొన్నారు,



ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666

# ఆ ఇద్దరిలో పీవీ మాత్రమే అప్పర్ హ్యాండ్ ఎలా అయ్యారు..?

**నేడు పీవీ జయంతి**

**భారతదేశాన్ని కాంగ్రెస్ పార్టీ తరపున నెహ్రూ కుటుంబానికి చెందని ఇద్దరు.. ప్రధానమంత్రులుగా పాలించారు. ఒకరు తెలుగు బిడ్డ పాములపర్తి వెంకట నరసింహారావు కాగా, మరొకరు పంజాబ్ సర్దార్ డాక్టర్ మన్మోహన్ సింగ్.**

ప్రధానమంత్రులుగా వీరిద్దరి ఎన్నికలో, వీరిద్దరి పరిపాలనలో చాలా సామ్యాలు, తేడాలు వున్నాయి. ఒకరు అపర చాణక్యులుగా పేరు తెచ్చుకుంటే.. మరొకరు యాదృచ్ఛిక ప్రధానమంత్రిగా అపఖ్యాతి పాలయ్యారు. ప్రధానమంత్రి కాకముందు పీవీకి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా (స్వల్పకాలం) విదేశీ వ్యహారాలు, మానవవనరుల శాఖల కేంద్రమంత్రిగా పనిచేసిన అనుభవం వుంది. మన్మోహన్‌కు ఆర్థిక మంత్రిగా పనిచేసిన అనుభవం వుంది.

పీవీని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఇందిరా గాంధీ ఎంపిక చేస్తే, ఆమె కోడలు సోనియాగాంధీ శంకర్ దయాళ్ శర్మ ప్రధాన మంత్రి పదవిని తిరస్కరిస్తే.. పీవీని ఎంపిక చేశారు. ఇందిరా గాంధీకి అప్పుడు ఒక బలహీనమైన మనిషి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కావాలి. కనుక ఏ కాంగ్రెస్ ముఠాల బలమూ లేని పివిని ఎన్నిక చేసింది. పీవీ అధికారం ఇచ్చిన బలంతో భూసంస్కరణలు లాంటి విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుని, గట్టిగా మాట్లాడి ప్రత్యేక ఆంధ్ర ఉద్యమ నేపధ్యంలో పదవి పోగొట్టుకుని ఢిల్లీకి వలస వెళ్లి ఆ నగరాన్ని తన శాశ్వత నివాసంగా మలచుకున్నారు.

ప్రధానమంత్రిగా అవకాశం వచ్చినప్పుడు ముఖ్యమంత్రిగా పని చేసినప్పటి అనుభవ పాఠాలను నెమరువేసుకుంటూ మైనారిటీ ప్రభుత్వాన్ని ఐదేళ్లు అసిధారా వ్రతంలా నడిపి చరిత్రలో తన పేజీ తాను లిఖించుకున్నారు. ముఖ్యమంత్రిగా గట్టిగా మాట్లాడి పదవి పోగొట్టుకున్న పివి.. ప్రధానమంత్రిగా మౌనవ్రతం పాటించి పదవి నిలుపుకుని.. తాను అనుకున్నది నిరాటంకంగా చేశారు. పీవీ చాణక్యం అంతా రెండు అధికార కేంద్రాలు లేకుండా చూసుకోవడం లోనే వుంది. ప్రధాని అయిన మొదట్లో 10 జనపథ్‌ను తరచూ సందర్శించి.. విమర్శలకు తావిచ్చిన పీవీ ఆ తర్వాత ఆ సందర్శనలు చాలా వరకు తగ్గించారు.

లైసెన్స్ రాజ్‌ను వదిలించుకుని ఆర్థిక సంస్కరణలను కొనసాగించడానికి రాజీవ్ పేరును పదే పదే వల్లించి అంతఃపురం నుంచి ఎదురు లేకుండా చూసుకున్నారు. విదేశాంగ విధానంలో లుక్ ఈస్ట్ విధానానికి పునాది వేశారు. ఏ ప్రమాదమూ లేదు అనుకున్నప్పుడు మెరుపు కంటే వేగంగా నిర్ణయాలు తీసుకుని, వ్యతిరేకత వస్తుంది అనుకున్నప్పుడు ఎనాలసిస్ అంటిల్ పెరాలసిస్ అనే విధానం అవలంభించారు. తన నిర్ణయాలు, సంస్కరణలను మొదలుపెట్టడం, విదేశీ వ్యవహారాల్లో తూర్పు వైపు అని చూపు సారించడం.. ఇలా అతడు అనేక యుద్ధాల్లో ఆరితేరినవాడు పీవీ.

ఇందుకు విరుద్ధంగా మన్మోహన్‌సింగ్‌కు.. ప్రభుత్వాన్ని కాపాడుకునే తలనొప్పి లేదు. పీవీకి భిన్నంగా రెండు అధికార కేంద్రాలను అనుమతించి ప్రభుత్వాన్ని కాపాడుకోవటం అనే తలనొప్పిని మించిన తలనొప్పి కొనితెచ్చుకున్నారు. ఆ నొప్పిని బయటకు కనిపించకుండా



వాటి పర్యవసానాల గురించి లోతుగా అధ్యయనం చేసే నరసింహారావు.. ఆర్థిక సంస్కరణలు మిస్‌ఫైర్ అయినప్పుడు సంస్కరణలకు మకరముఖం తప్పిస్తే.. మానవముఖం లేకుండా పోయిందని ఆవేదన చెందారు. కాంగ్రెస్ రెండోసారి గెల్చి మళ్లీ పీవీ రెండోసారి ప్రధాన మంత్రి అయి ఉంటే (అసంభవమైన ఊహ అయినా సరే) పీవీ తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు అవి ఈ రూపంలో ఉండేవి కాదేమో అనిపిస్తుంది. పాకిస్థాన్ విషయంలో ఏమీ చేయకుండా ఏదో చేసే వ్యూహాన్ని ఆయన అనుసరించారు.

ఆయన తర్వాత వాజ్‌పేయి కార్గిల్‌లో యుద్ధం చేస్తే, మళ్లీ ఇప్పుడు మోడీ ఆపరేషన్ సిందూర్, సింధు జలాల ఒప్పందం నిలిపివేత వంటి కొత్త వ్యూహాలతో సంబంధాలను నిర్వచిస్తున్నారు.

సుస్థిర ప్రభుత్వాన్ని అందించడం, ఆర్థిక సంప్రదాయ పంజాబీ తలపాగా మాటున దాచిపెట్టారు. పీవీ మంత్రివర్గంలో ఆర్థిక సంస్కరణలు మొదలు పెట్టినప్పుడు సగటు కాంగ్రెస్‌వాదుల విమర్శలకు కోపగించుకుని మంత్రిపదవికి రాజీనామా సమర్పించి.. పీవీ దానిని ఆమోదించకపోతే అయిష్టంగానే కొనసాగిన మన్మోహన్.. తాను ప్రధాని అయిన తర్వాత ప్రభుత్వ పరంగా తాను ప్రకటించిన ఒక విధాన నిర్ణయాన్ని రాహుల్ గాంధీతో పంచుకున్న ఒక సభలో ఆ విధానంపై రాహుల్ వ్యతిరేకత ప్రకటిస్తే వేదిక మీదే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే సహనాన్ని ఆయన అలవరచుకున్నాడు.

పార్లమెంట్ వేదికగా ప్రతిపక్షాలు తనను ఇరుకున పెడతాయని భావించినప్పుడల్లా వారిని ఇరుకునే పెట్టె అంశాలవైపు పీవీ దృష్టి సారిస్తే.. మన్మోహన్ నిస్సహాయంగా నిలిచేవారు.

మన్మోహన్ తన పదవీకాలం మొత్తం మీద విపక్షాల మీద విసుక్కున్నది ఒకే ఒక సందర్భంలో. ప్రతిపక్షాలు సభని స్తంభింపచేసి వినతి పత్రాన్ని ఇవ్వడానికి తన ఛాంబర్‌కు వస్తే.. సభలో అడగవలసిన విషయాలకు ఛాంబర్‌లో వినతి పత్రాలు ఎందుకు అని చురక వేయడం ఒక్కటే ఆ సందర్భం.

పీవీకి సోనియాను సంతృప్తిపరచవలసిన బాధ్యత ఎప్పుడూ మీద కత్తిలా వేలాడుతూ ఉంటే మన్మోహన్‌కు ఆ బాధ్యత రెండింతలు పెరిగి.. మెడ మీద నాలుగు కరవాలాలు అయ్యాయి. పివి మొదటి నుంచి కాంగ్రెస్ రాజకీయాలలో ఆరితేరి తన సహచర నాయకుల గురించిన కూలంకషమైన అంచనాలు ఉండి.. ఎవరిని ఎక్కడ నొక్కాలో అక్కడ నొక్కేవారు.

మన్మోహన్‌కు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో చదివిన, పనిచేసిన అనుభవం తప్పితే.. రాజకీయ రణతంత్రాలు తెలియవు. అందుకే కాంగ్రెస్ నాయకులు ఆయన మీద స్వారీ చేసేవారు. పీవీ తను సాధించిన విజయాలను తనకున్న పరిస్థితుల రీత్యా.. రాజీవ్, నెహ్రూల మాటున దాచి ఉంచేవారు. ఈ వ్యూహాన్ని రాజశేఖర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో తర్వాత అనుసరించారు.

మన్మోహన్ తాను సాధించిన విజయాలు సోనియా ఖాతాలో పడిపోతున్నా నిర్లిప్తంగా ఉండేవారు. తిరుపతి ప్లీనరీని పీవీ అంతా తానై నడిపిస్తే (ఆ ప్లీనరీకి సోనియా రాలేదు).. మన్మోహన్ ప్రధానిగా వున్నప్పుడు జరిగిన ప్లీనరీలో మన్మోహన్ ఏ ప్రాధాన్యతా లేకుండా ఒక మూలగా ఉండిపోయారు. ఈ ప్లీనరీ జరుగుతున్నప్పుడు రాసిన రన్నింగ్ కామెంటరీలో ఓ వ్యాసకర్త.. 'ప్లీనరీలో పాపం మన్మోహన్.. తనకంటూ స్పేస్ లేక మోము చిన్నబోయెన్' అంటూ రాశాడు.

ఇద్దరు ప్రధానమంత్రుల దగ్గర పనిచేసిన సంజయ్ బారు పీవీ గురించి రాసిన పుస్తకంలో ఆయనకు భారతరత్న ఇవ్వాలని ప్రతిపాదిస్తే.. మన్మోమోహన్‌జి యాదృచ్ఛిక ప్రధానమంత్రి అన్నారు. పీవీ పరిపాలన మీద ఇన్నాళ్లకు నాలుగు, ఐదు పుస్తకాలు కనిపిస్తుంటే.. మన్మోహన్ మీద నిష్పాక్షికంగా పుస్తకాలు రావలసిన అవసరాన్ని ఈ సమయం గుర్తు చేస్తున్నది.

బాతాఖానీ సౌజన్యంతో..

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

**మంత్రి కొలుసు పార్థసారథికి జర్నలిస్టు సంఘాలు వినతి**



**(సత్యంన్యూస్, విశాఖపట్నం)**

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధుల బృందం సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. విశాఖ నగరంలోని రామనగర్ తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఆయనను కలిసి సమస్యలపై చర్చించారు. కూటమి ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం జర్నలిస్టులకు నాలుగు సెంట్లు చొప్పున ఉచితంగా ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా 58 ఏళ్లు దాటిన జర్నలిస్టులకు రూ.10వేలు పెన్షన్ సదుపాయం కల్పించాలని, అక్రిడేషన్లు సత్వరమే జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. నిలిపివేసిన ప్రమాద బీమా సౌకర్యాన్ని రూ.10 లక్షలకు పెంచి అమలు చేయాలని, జర్నలిస్టులపై దాడుల నివారణకు నివారణ కమిటీలు తక్షణమే ఏర్పాటు చేయాలని, కోవిడ్‌తో చనిపోయిన జర్నలిస్టులకు రూ.5లక్షల పరిహారం జీవోను అమలుచేయాలని ఆయనను కోరారు. ఎంప్యానల్డ్ దిన పత్రికలతో పాటు నాన్ ఎంప్యానల్డ్ దినపత్రికలు, పిరియాడికల్స్ తగినన్ని ప్రభుత్వ ప్రకటనలు విడుదల చేసి చేయూతనివ్వాలన్నారు. దీనిపై స్పందించిన పార్థసారథి జర్నలిస్టుల సమస్యలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని సత్కరించారు. మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రామచంద్రరావు, ఉపాధ్యక్షుడు కె.చంద్రమోహన్, కొయిలాడ పరుశురాం, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చందు యాదవ్, జాప్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఎం.కీర్తన రావు, శ్రీహరి, నాయుడు, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**అద్దెకు ఇవ్వబడును**

చిన్నబజారు దూదివారి కోవెల ఎదురుగా
మూడు ఫ్లోర్ల బిల్డింగ్ అద్దెకు ఇవ్వబడును.
ఒక్కో ఫ్లోర్ 1200 చదరపు అందుగులు (20×60)
- వివరాలకు సంప్రదించగలరు -
9866 222 636

# కందకం తవ్వుతారా?.. ఖబడ్దార్!

మొదటిపేజీ తరువాయి

ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించి, చెరువును కాపాడేందుకు వీలుగా దాని చుట్టూ కందకం తవ్వడానికి ప్రతిపాదనలు రూపొందించి పంపగా.. కలెక్టర్ ఆమోదించి కందకం తవ్వకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఆ మేరకు ఉపాధి హామీ పథకం కింద కందకం పనులు చేపట్టడానికి ఈ నెల 24న ఉపాధి పథకం క్షేత్ర సహాయకుడితో పాటు వేతనదారులు వెళ్లారు. అయితే అక్కడ ఆక్రమణదారులు అడ్డుకొని దాడికి ప్రయత్నించడంతో వారంతా వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ ఘటనపై శ్రీకాకుళం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన పనులు చేపట్టేందుకు వెళ్లే ఉపాధి హామీ సిబ్బందికి రక్షణ కల్పించాలని కోరుతూ గార తహసీల్దారుకు, పోలీసులకు లేఖ రాశారు. అయితే ప్రోటోకాల్ కారణంగా చర్యలు తీసుకోవడంలో ఆలస్యమవుతోందని మండల అధికారులకు పోలీసులు చెబుతున్నారు.

### పనులపై అభ్యంతరాలు

బరాటం చెరువుకు వచ్చే నీటిని చుట్టుపక్కల ఆరు చెరువులకు మళ్లించడం ద్వారా 728 ఎకరాలకు సాగునీరు అందించేవారు. అయితే ఆక్రమణల కారణంగా ఆయకట్టు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోయింది. ఆక్రమణలను తొలగించడానికి అధికారులు చేస్తున్న ప్రయత్నాలను అధికార పార్టీకి చెందిన స్థానిక నేతలే అడ్డుకుని.. ఆక్రమణదారులకు తెర వెనుక మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా ఆక్రమణలు తొలగించడానికి పోలీసుల రక్షణ కల్పించాలని కోరడంపై శ్రీకాకుళం సానివాడకు చెందిన ఇద్దరు వ్యక్తులు నేరుగా ఎంపీడీవోనే నిలదీసినట్లు తెలిసింది. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి న ఆ ఇద్దరు గార రెవెన్యూలో ఉన్న చెరువులో పనులను శ్రీకాకుళం అధికారులు ఎలా మంజూరు చేస్తారని నిలదీస్తూ తమ స్వాధీనంలో ఉన్న చెరువు భూముల్లో పనులు జరగనిచ్చేదిలేదని అన్నట్లు తెలిసింది. దాంతో ఎంపీడీవో కూడా ఘాటుగా స్పందించి వారిద్దరినీ తీవ్రంగా హెచ్చరించి పంపేసినట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో కూడా సర్పంచ్ ఫిర్యాదు మేరకు చెరువును సర్వే చేస్తున్న గార తహసీల్దారును శ్రీకాకుళం బౌండరీలో ఉన్న చెరువును మీరెందుకు సర్వే చేస్తున్నారంటూ అక్రమార్కులు అడ్డుకొనేందుకు ప్రయత్నించారు. శ్రీకాకుళం ఎంపీడీవో నుంచి ఉపాధి పనులు చేయడానికి ఈసీ తీసుకువస్తే అభ్యంతరం లేదని, అయితే కలెక్టర్ ద్వారా కందకం తవ్వడానికి ఇచ్చిన ఉత్తర్వులను మాత్రం అంగీకరించేది లేదంటున్నారు. గార బౌండరీలో ఉంది కాబట్టి ఎంపీడీవో ఉపాధి పనులు మంజూరు చేయాలని, లేదంటే అడ్డుకుంటామని పేచీ పెడుతున్నారని తెలిసింది.

### సర్పంచ్‌పై రాజకీయంగా ఒత్తిడి

ప్రస్తుతం గ్రామంలో ఇదే చర్చనీయాంశంగా మారింది. కేవలం రెండు కుటుంబాలకు చెందిన నలుగురు వ్యక్తులు చెరువును ఆక్రమించి అందరినీ ఇబ్బంది పెడుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణదారుల సమీప బంధువులు అధికార, ప్రతిపక్ష పార్టీల్లో ఉండటం వల్లే వారు రెచ్చిపోతున్నారని తెలిసింది. కాగా ఆక్రమణదారుల్లో ఇద్దరు ఉద్యోగులు కూడా ఉన్నట్టు ప్రచారంలో ఉంది. వీరంతా కలసి రాజకీయ అండతో చెరువులో ఆక్రమణల తొలగింపును అడ్డుకుంటున్నారని ప్రచారంలో ఉంది. ఆక్రమణలను తొలగించే ప్రయత్నాలను విరమించుకోవాలని గ్రామ సర్పంచ్ రుప్ప లక్ష్మిపై వారంతా రాజకీయంగా ఒత్తిడి తెస్తున్నారు. వీరిలో టీడీపీ నాయకులే ఎక్కువ మంది ఉన్నట్లు తెలిసింది. చెరువులో ఆక్రమణలు తొలగించాలని నాలుగేళ్లుగా అధికారుల చుట్టూ తిరిగిన సర్పంచ్ లక్ష్మి టీడీపీ మద్దతుదారు అయినా ఆ పార్టీలో ఆమెను సమర్థించే వారికంటే వ్యతిరేకించేవారే ఎక్కువగా ఉన్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఆక్రమణల వల్ల సాగు విస్తీర్ణం తగ్గిపోయిందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాయకుల్లో చిత్తశుద్ధి, అధికారుల్లో నిబద్ధత ఉంటే ఈ ప్రక్రియ సజావుగానే సాగిపోతుందని స్థానికులు చెబుతున్నారు.

# అలుక వీడి.. అడుగు పడుతోందా?!

(మొదటిపేజీ తరువాయి)

కొంతమేర ఊగిసలాట ఉన్నా, మళ్లీ యాక్టివ్ కావడానికి ఇంతకు మించిన సందర్భం మరోటి ఉండదనే భావన కూడా ధర్మానలో ఉంది. దీనికి తోడు 42 గ్రామాల ప్రజల మద్దతు ఉన్నందున ఇటువంటి ఉద్యమాన్ని తలకెత్తుకోవాలని ఆయన చూస్తున్నారు.

శ్రీకాకుళం రూరల్ మండలం నైర గ్రామం వంశధార నదీ తీరంలో 2005లో ధర్మాన రెవెన్యూ మంత్రిగా ఉన్నప్పుడు సీపీడబ్ల్యు స్కీమ్ కింద మంచినీటి ప్రాజెక్టును నిర్మించారు. దీని ద్వారా 42 గ్రామాల ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు. ఇందుకోసం శిలగాం సింగువలస వద్ద ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (ఓహెచ్‌బీఆర్)లు నిర్మించి ప్రతీ గ్రామంలోను ఓపెన్ హెడ్ స్టోరేజ్ రిజర్వాయర్లు (ఓహెచ్ ఎస్ఆర్) ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. వీటికి మంచినీరు ఎక్కడి నుంచి వస్తుందంటే.. నైర వద్ద వంశధార నదిలో ఇన్‌ఫిల్ట్రేషన్ బావులను తవ్వారు. నదిలో ప్రవహిస్తున్న నీరు ఈ బావుల్లోకి ఫిల్టరైతే అక్కడి నుంచి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు నీటిని ఎక్కిస్తారు. దీనివల్ల ప్రతీ గ్రామానికి నీరందిస్తున్నారు. అయితే కేవలం కొన్ని ప్రాంతాలకు మాత్రమే నీరందుతుందని, ఇక్కడ వనరులు పుష్కలంగా ఉన్నాయని తెలుసుకున్న ధర్మాన జైపాల్‌రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నప్పుడు మరికొన్ని హడ్కో నిధులు మంజూరు చేయించుకొని మరిన్ని గ్రామాలకు ఇదే ప్రాజెక్టు నుంచి నీరందించే కార్యక్రమాన్ని పూర్తిచేశారు. దీంతో రూరల్ మండలంలో సముద్రం ఒడ్డున ఉండే కళ్లేపల్లి, కిల్లిపాలెం, ఇప్పిలి వంటి గ్రామాలు తప్ప మిగతా అన్ని గ్రామాలకు నీరందడంతో దీని పరిధిలోకి 42 గ్రామాలు వచ్చాయి. సరిగ్గా ఇప్పుడు ఇదే ప్రాజెక్టుకు ప్రాణాధారంగా ఉన్న ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల వద్ద ఇసుకను తోడేస్తున్నారు. ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల చుట్టూ 500 మీటర్ల రేడియస్‌లో ఇసుక తవ్వకూడదనే చట్టం ఉన్నప్పటికీ దాన్ని పట్టించుకోవడంలేదు. మరీ విచిత్రంగా ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి భైరిదేశిగెడ్డ కాలువ గట్టుపై రైతులు, షట్టర్ల మరమ్మతుల కోసం ఉద్యోగులు నడిచేందుకు వీలుగా వేసిన కాలిబాటను పూర్తిగా ధ్వంసం చేసి, దాని పైనుంచి భారీ వాహనాలతో ఇసుకను తరలించేస్తున్నారు. దీనిపై వైకాపా నాయకులు జిల్లా మైన్స్ అధికారులు, కలెక్టర్, గ్రౌండ్ వాటర్‌వర్క్స్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం దక్కలేదు. దీంతో 42 గ్రామాల ప్రజలంతా సమష్టిగా ఉద్యమించాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం వచ్చే నెల 4న నైరలోని రైతుభరోసా కేంద్రం భరోసా ఎదురుగా ఉన్న స్థలంలో ధర్నా చేయడానికి సిద్ధపడుతున్నారు. రాష్ట్రంలో అన్నిచోట్ల ఉచిత ఇసుక పేరుతో తవ్వకాలు జరగడాన్ని ప్రభుత్వ పాలసీలో భాగంగానే చూడాలి గానీ, తాగునీరు అందించే ప్రాజెక్టుల వద్ద కూడా ఇసుకను తవ్వేస్తే భవిష్యత్తులో ప్రాజెక్టు కనుమరుగవుతుంది కాబట్టి, దీనిపై ఉద్యమించాల్సిందేనని ధర్మాన భావిస్తున్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం తన కార్యాలయంలో రూరల్ సర్పంచ్‌లు, ఎంపీటీసీ, పార్టీ నాయకులతో ఆయన చర్చించారు. తాను కూడా ఈ ధర్నాకు హాజరవుతానని పరోక్షంగా ప్రకటించారు. పార్టీ జెండాలు లేకుండా కేవలం ప్రజా సమస్య పరిష్కారం దిశగా ఉద్యమించడానికి ఆయన



ముందుకొస్తున్నట్టు తెలుస్తుంది. మరోవైపు ఒకటి రెండు విషయాల్లో పార్టీకి, ఆయనకు మధ్య ఒక అవగాహన కుదరకపోవడంతో 4న జరిగే ధర్నాకు వెళ్లాలా, వద్దా? అన్న మీమాంస కూడా ఆయన్ను వెంటాడుతోంది. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు ప్రస్తుత ఎమ్మెల్యే ఇసుకను అక్రమంగా తోడేస్తున్నారంటూ పెద్ద స్థాయిలో ఉద్యమించారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా అదే జరుగుతున్నందున ధర్మాన ఆ దిశగా అడుగు లేయాలని రూరల్ నాయకులు భావిస్తున్నారు. ధర్మాన ఈ కార్యక్రమానికి రావడాన్ని పార్టీ కోణంలో కాకుండా, ఆయన తెచ్చిన ప్రాజెక్టును ఆయనే సంరక్షించుకునే కోణంలో చూడాలని, అందుకోసం 42 గ్రామాల ప్రజలకు మద్దతివ్వాలని ఆయన కోరుతున్నారు.

'మహిళ' ఒక శక్తని, మహిళలు ఎంచుకున్న రంగమేదైనా, అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక మెప్మా కార్యక్రమంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం అండగా ఉంటుందని, పట్టణ ప్రాంతాలలోని పేదరిక నిర్మూలనకు మెప్మా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం మెప్మా ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన స్యాంసంగ్ ట్యాబ్లు, స్కానర్లు, డివైసర్లు ఆర్పీలకు గృహలక్ష్మిలకు అందించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ, స్వయం ఉపాధి మహిళలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.